అంతలో ఏ మొచ్చిందో -
అన్నీ అపస్వరాలొలికిస్తూ
ఈ విశాల ప్రశాంత
ఏకాంత సౌధమ్ములో
నిదురించు జహాపనా-
అని వెక్కిరిస్తూ పాడారు.

నాకు వెర్రికోపం వచ్చేసింది. వెనకనుంచి వెళ్ళి చిన్నతోపు తోశాను. తాజ్‌మహల్ గచ్చు మీద పాట ఆపి పడబోయి తమాయించుకుని "ఏం ఒళ్లు పొగరెక్కుతోందా?" అని సకిలించారు "ధన్యోస్మి - మీరు పాట ఆపారు. అంతేచాలు;" అని నమస్కారం చేశాను.

దాసరి తప్పులు దండంతో సరి

దూరంగా నల్లటి ఇసుకమధ్య యమునా నదీ ప్రవాహంలో పెద్ద పెద్ద తాబేళ్ళను చూస్తూ ఆవలి గట్టున మరో తాజ్‌మహల్ షాజహాన్ ఎందుకు కట్టలేదా అని అనుకుంటూ అలా అలా నిలబడిపోయాను.

మరో తాజ్‌మహల్
మరో ఊర్వశి
మరో నాయుడుగారు
మరో సైగాల్
మరోకృష్ణశాస్త్రి. ఇవి సంభవమా?
ఐడోంట్నో....

# వంటచేయని రాత్రి

ఆడదాని బ్రతుకు -

సొట్టబిందెలు, చిల్లులబాల్చీలు, తిన్నకంచాలు ఎంగిలి గ్లాసులు, అంట గిన్నెలు, వెలిసి పోయినచొక్కాలు, మాసినబట్టలు, నల్లులమంచాలు, ఉచ్చలుపోసిన పరుపులు, సిమెంటు బస్తాల్లా గడ్డ కట్టిన దిళ్ళు, మరకల దుప్పట్లు, చేతులు విరిగిన కుర్చీలు, చీవిడిముక్కు పిల్లలు, అద్దం పగిలిన ఫోటోలు, అట్టలూడిన పుస్తకాలు, చెడు తిరుగుళ్ళు తిరిగి ఇంటికి వచ్చిన నవలలు, కథలు, పాత పత్రికలు, గోడమీద గాలికెగిరే నిరుటి క్యాలండర్లు, అలారమూ టైమూ రెండూ చూపించని అలారం టైము పీసు, కిటారి తలుపులు కిటకిట తలుపులు మొండి గడియలు,

పొట్టిగుమ్మాలు, చీకటిగదులు – చీపురు కట్టలు, చిరుగుల బొంతలు – చింకి చాపలు. మేకులు కొట్టినజోళ్ళు – మేకులుదిగని గోడలు, పళ్ళూడిపోయిన దువ్వెన, పింగాణిపోయిన అద్దం, గడ్డకట్టిన వార్నిషు డబ్బా, కాన్వాసు చిరిగిన మడత మంచాల క్రింద మూడుచక్రాల సైకిలు, పేం బుట్టలో పాంకోళ్ళు, పందిరిమంచం సరంజామా పేకముక్కలు, చింతపిక్కలు, అట్టపెట్టెలు – సిరాబుడ్లు, వీధిలో కుక్కలు – యింట్లో జాగిలము రెండు దూదిబస్తాలు, మూడు రాచిప్పలు అలమార్లలో బొద్దింకలు, వంటింటో ఎలకలు, దొడ్లో కాకులు, కాళీసీసాల్లో పారపొయ్యని మందులు, బాదంచెట్టుమీద కాకిగూడు కాకిగూట్లో ఎత్తుకుపోయిన మిల్లిగరిటె, జాజిచెక్కల బీరువా, భోషాణం పెట్టె, నడుం విరిగిన టేబుల్‌లైటు, సూటుకేస్, హాండ్‌బ్యాగ్, పోపుల డబ్బా, పాత గ్రామ ఫోను– అరిగిపోయిన రికార్డులు, అప్పడాల కర్ర, రొట్టెల పీట, లక్కపిడతలు చందనపు బొమ్మలు, ఇస్త్రీ పెట్టె–వెంటిలేటర్లో పిచికల గూళ్లు, పాత గొడుగులు– డబ్బులులేని ఆదివారాలు.... అబ్బబ్బ! నరకం.... బయట చూస్తే –

చాదస్తపు నవలలా ఉదయాన్నే ప్రారంభ మైంది వర్షం!

ఉన్మత్త రాక్షసుడి శరీరంలా ఆకాశంలో బులబులాగ్గా నీటితో నిండి వ్రేలాడుతూన్న మేఘాలు,

ఎదురుగుండా హృదయాలు ఘనీభవించి కరుడుకట్టినట్లున్న కొండ –

జాతీయమైన సంస్కృతిలా కాలు పట్టుకుని వదలటం లేదు రోడ్డుమీద బురద –

అబ్బ–జీవితం జిడ్డుగా, బరువుగా, భారంగా, దరిద్రంగా వుంది.

నాన్సెన్స్–లైఫ్ ఇలా వుండటానికి వీల్లేదు. చిన్నవాళ్ళ జీవితాల్లో – చిట్టిపొట్టి కోర్కెలూ చిల్లర సరదాలూ ఏవో ఏవో జీవితానందాలూ కొన్నైనా తీరాలి!

ఇల్లాలి వేడి వేడి నిట్టూర్పులు, ఊద్పులు, గాద్పులు వెక్కి వెక్కి ఏడ్పులు ఫిట్లు – నీరసాలు. ఎండి మండి పోడాలు కొంతవరకైనా తగ్గాలంటే ఏం చేయా లేం చేయాలేంచేయాలి?

ఓ డబ్బులేని ఆదివారం

అంతకు ముందురోజు చిత్తుకాగితాలు అమ్మి ఆరేడు రూపాయలు ప్రోగుచేసి యింట్లో వాడేశాను.

తరవాతెప్పుడో – డబ్బాలు డొక్కులు పనికిరాని సీసాలు సొట్టపడ్డ గిన్నెలు నానా జంకు. జంకు లేకుండా జంకుసామానుల వాడి కిచ్చి మూడు నాలుగు రూపాయలు పుట్టించి కాలక్షేపం చేశాం.

అన్నీ కొంచెం కొంచెం వున్నాయి యింట్లో

బియ్యపు నూకలు విసిరి దోసెలుపోసి ఉప్మా చేసి పెడితే తిని డబ్బా పాలతో చేసిన టీ త్రాగి పడుకున్నారు పిల్లలు.

అప్పిచ్చువాడు వైద్యుడు ఎవరూ చుట్టు ప్రక్కలలేరు. జీతం ఒకటో తారీఖున –ఒకటో తారీకు ముందు రోజుందే ఆరోజే ఎంత త్రోసినా గడవని నడవని గడ్డుదినం.

ఆ రోజు మేమిద్దరం చాలా గంభీరంగా వున్నాం. ఎందుకంటే ప్రాయోపవేశం చెయ్యాలి. బేడ రొట్టెలు, పళ్ళు, దోసెలు పాలు వీటితో పిల్లలు తృప్తిగా తిని పడుకున్నారు.

చెప్పానుగా - బైటవర్షం...

టప...టప...టప....టప....

గాలివీస్తోంది.

కిటికీ అద్దాలమీద జల్లు నిర్దయగా కొడ్తోంది.

మా కడుపులో దుఃఖం బైటవర్షం;

ఆయనకు నోటమాట రావటం లేదు.

నాకు పలకరించడానికి ధైర్యం చాలడం లేదు.

పొయ్యిలో పిల్ల లేవలేదు రాత్రికి.

స్టవ్‌లో కిర్సనాయలు లేదు. కుంపట్లో బొగ్గులు లేవు.

నోట్లో మాటలేదు మెదళ్లో ఆలోచనలేదు.

చాపమీద పడుకున్న చిన్నవాడి తల బాగా మాసింది.

నేను బాత్‌రూమ్‌లో ఏదో పనిచేసుకుంటున్నా.

తిరిగివచ్చేసరికి నేను చూసిన దృశ్యంతాలూకు సందర్భం యిది -

ఒక న్యూస్‌పేపరు పరిచారు.

దానిమీద రాముగాడ్ని కూర్చోపెట్టి వాడికి జుట్టు కత్తిరిస్తున్నారు.

అదేమిటండి? అని నోరు నొక్కుకున్నా,

చాలాకాలంనుంచీ క్రాపు చేయడం నేర్చుకోవాలని వుందట. గాంధీగారు అలా చేసేవారట. ఇంకా ఏమో చాలా చెప్పారు.

పనిచేస్తే అర్ధరూపాయి కలిసొస్తుందనీ అదికూడా ఒక కళేననీ ఏమిటో చెప్పారు.

-వాడు ఆ పసి వెధవ కదలకుండాకూర్చుని చేయించుకుంటున్నాడు.

కాని ఆయనకు క్రాపుచేయడం రాలేదు. అది అంత సులువైన పనికాదని తెలిసేటప్పటికి పిల్లవాడితల గంట్లు గంట్లు పడి చూడ్డానికి చాలా అసహ్యంగా వుంది.

ఆయన మనస్సు వాడి గుండెలా గంట్లుపడిపోయి అవకతవకగా తయారయింది.

పిల్లాడికి స్నానం చేయించి తలకు తువ్వాల చుట్టి రిక్షాలో కూర్చోపెట్టి - పెట్టి - పెట్టి అడుగు ఆఖరు రూపాయనోటు తీసియిచ్చి ఆయన్ను బజారుకు పంపించేసరికి తాతలు దిగివచ్చారు.

ఏం చెప్పమంటావే - అన్నారు రిక్షాలో కూర్చుని.

పిల్లలెవరో డాబామీద మూల కూర్చోపెట్టి జుట్టు కత్తిరించేశారని చెప్పండి అన్నా.

ఆయన మళ్ళీ వచ్చేసరికి గరం గరం చాయి కాచి ఫ్లాస్కులో పోసి వుంచాను. సైకిలు మీద రొట్టెలవాడొస్తే - ఒక బన్‌రొట్టె బిస్కెట్లు కొని దాచి పెట్టాను. ఇంటి పని పూర్తి చేసి చాప పరిచి - దానిమీద బొంతలు వేసి ఆపైన మంచి దుప్పటి సర్ది - పచ్చి చెక్కముక్కలు కోస్తున్నాను.

చామంతిపూలు పట్టుకొచ్చారు వస్తూ వస్తూ

ఈ వెధవ - నాజుట్టూ నాన్నే కోశాడు అని చెప్పాడే షాపువాడితో అని నవ్వారు.

"ఆకాశమంత ఎత్తు మనుష్యులు చేసేపనులు అంగుష్ట మాత్రులు చేయకూడదు." అని చిన్న చురకతగిలించాను.

ఎగా దిగా చూశారు.

"పురుషులందు పుణ్యపురుషులు వేరయా-" అన్నాను.

ఉడుక్కున్నారు, ఓదార్చాలి -

ఇంట్లో అన్నీ నిండుకున్నాయంటే - అది ఆయనచేసిన తప్పు కాదుగా.... చెప్పొద్దూ .... వంట చేయక్కర్లేదు. అప్పటికి నా ప్రాణం హాయిగా వుంది.

ఏదో తిన్నారు ఏడిపించకుండా.

పిల్లల్ని పడుకో పెట్టి ఆటకు కూర్చున్నాము.

చదరంగం పేర్చాను.

ఆయన ముఖం చేటంతయింది.

ఆటమీద ఆట, పట్టుదలలు పెరిగిపోయాయి.

పౌరుషాలు రెచ్చిపోయాయి.

అర అరగా టీ త్రాగాము,

బిస్కట్లు తిన్నాము. నాన్‌రొట్టి నవిలాము.

కొన్ని ఆయన ఓడి పోయారు.

కొన్ని నేను ఓడిపోయాను.

సాయంత్రం ఏ అయిదారు గంటలకు కూర్చున్నామో మర్నాడు ఉదయం పాలవాడి కేక వినిపించేవరకూ మాచదరంగం ఎత్తుకు పై ఎత్తులు సాగుతునే ఉన్నాయి.

తెల్లారి పోయిందా అని నవ్వారు.

ఆ రాత్రల్లా వర్షం వర్షంలా కురుస్తోనే వుందట - ఒక శ్లోకం కూడా చదివారు, చివరపాదమనుకుంటా.

అవిదిత గత యామారాత్రి రేవ వ్యరంసీత్॥ రాముడూ సీత పిచ్చాపాటి ఆడుకుంటుండగా - సమయం ఎలాగడిచిపోయిందో తెలుసుకోవడానికి ముందే రాత్రి గడచిపోయిందట.

అలాగే మా ఇంట్లో - తిండిగింజలు నిండుకున్నా వంటచేయని రాత్రి - టీ త్రాగుతూ బిస్కట్లుతింటూ చదరంగం ఆడుతుంటే -

అవిదిత గత యామారాత్రి రేవ వ్యరంసీత్॥